క్లుప్తంగా

గాజులగట్టు వాసికి డాక్టరేట్



గూడూరు: మండలంలోని గాజులగట్టు శివారు సోమ్లా తండాకు చెందిన ధరంసోత్ వీరన్ననాయక్ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి రసాయన శాస్త్ర విభాగంలో డాక్టరేట్ అందుకున్నారు. డాక్టరేట్ రావడంపై తల్లిదండ్రులతో పాటు గ్రామస్తులు అభినందించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



కేసముద్రం: మండలంలోని కోరుకొండపల్లి గ్రామంలో సీడీఎఫ్ నిధులు రూ.5లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ఎంపీపీ వోలం చంద్రమోహన్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎండి.నజీర్అహ్మద్, ఎంపీటీసీ రాజు, శ్రీను, శ్రీరాంరెడ్డి, యాకమల్లు, కొమురయ్య పాల్గొన్నారు.

సీఐటీయూలో అంగన్‌వాడీల చేరిక

నెహ్రూసెంటర్: మండలంలోని కంబాలపల్లి సెక్టార్ అంగన్‌వాడీలు బుధవారం సీఐటీయూలో చేరారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్ మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమ్మె జరుగుతున్న సందర్భంలో అంగన్‌వాడీలు సంఘంలో చేరడం మరింత ఉత్సాహాన్ని నింపుతుందన్నారు. సీఐటీయూలో చేరిన వారిలో స్వరూప, భాగ్యమ్మ, రజిత, ప్రమీల, కళావతి, సుహాసిని, రాజ్యలక్ష్మి, సునీత, పద్మ, శిరీష ఉన్నారు.

చికిత్స పొందుతున్న ఇద్దరు మృతి

కురవి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఇద్దరు వ్యక్తులు చికిత్సపొందుతూ మృతి చెందినట్లు సీరోలు ఎస్సై రమాదేవి బుధవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం.. గత ఆదివారం రాత్రి సీరోలు మండలం చింతపల్లి శివారు సీరోలు క్రాస్ రోడ్డు వద్ద పెద్దలాల్ తండాకు చెందిన భూక్య ఈర్య అనే వ్యక్తి పశువులను తోలుకుంటు వస్తుండగా కారు ఢీకొనడంతో తీవ్రగాయాలు కాగా ఖమ్మం ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. అదే విధంగా సీరోలు శివారు రేకుల తండా జీపీకి చెందిన బానోత్ జవహర్‌లాల్ అనే యువకుడు పల్సర్ బైక్‌పై మంగళవారం రాత్రి వెళ్తుండగా చింతపల్లి శివారు సీరోలు క్రాస్‌రోడ్డు వద్ద ఎదురుగా వస్తున్న ఆవులను ఢీకొని తీవ్రగాయాలయ్యాయి. హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ అదే రాత్రి మృతి చెందినట్లు ఎస్సై రమాదేవి తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆమె వివరించారు.

గుండెపోటుతో వృద్ధుడి..

డోర్నకల్: మండలంలోని రావిగూడెం గ్రామానికి చెందిన అత్తులూరి వెంకయ్య(72) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. డోర్నకల్ ఎస్సై సంతోష్‌రావు బుధవారం తెలిపిన వివరాల ప్రకారం.. రావిగూడెం గ్రామానికి చెందిన అత్తులూరి వెంకయ్యకు గ్రామ శివారులో నాలుగెకరాల విస్తీర్ణంలో నీటి కుంట ఉంది. కుంటలో ఫిషరీస్ కోఆపరేటివ్ సభ్యులు చేపల పెంపకం చేపట్టారు. తమ అనుమతి లేకుండా కుంటలో చేపల పెంపకం చేపట్టారంటూ తరచూ గొడవలు జరుగుతుండటంతో వెంకయ్య మానసిక ఒత్తిడితో గుండెపోటుకు గురై మృతి చెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కాపర్ వైర్ చోరీ

గార్ల: మండలంలోని నగరం గుట్టల పరిధిలోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి కాపర్ వైరును గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. నగరం గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ఏర్పాటు చేసిన రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసి వాటిలోని కాపర్ వైరును చోరీ చేశారు. ట్రాన్స్‌ఫార్మర్ల పరిధి రైతులు గార్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నీటి సంపులో పడి బాలుడికి అస్వస్థత

మహబూబాబాద్ రూరల్: ప్రమాదవశాత్తు నీటి సంపులో పడి బాలుడు అస్వస్థతకు గురైన సంఘటన జిల్లా కేంద్రంలోని బాబాగుట్ట కాలనీలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబాగుట్ట కాలనీకి చెందిన స్పందన నాలుగేళ్ల కుమారుడు వినోద్, అమ్మమ్మ జయమ్మ వద్ద నిద్రిస్తున్నాడు. రాత్రి సమయంలో వినోద్ నిద్ర లేచి తలుపులు తీసి బయటకు వెళ్లగా సమీపంలోని నీటి సంపులో పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన బాలుడిని మహబూబాబాద్ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి ప్రథమ చికిత్స అందించారు. ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని, వరంగల్ ఎంజీఎంకు తరలించారు.

కేసీఆర్ పథకాలు దేశానికే ఆదర్శం

● ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్



మహబూబాబాద్ రూరల్: పోస్టాఫీసును ప్రారంభిస్తున్న ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్ నాయక్

మహబూబాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రజల కోసం సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శమని ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని సికింద్రాబాద్ తండా గ్రామంలో నూతన బ్రాంచ్ పోస్టాఫీసును బుధవారం ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ ప్రారంభించారు. అదేవిధంగా రూ.20లక్షల వ్యయంతో నిర్మించనున్న జీపీ భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ దయతో తండాలు, గ్రామాలకు మహర్దశ వచ్చిందన్నారు. సంక్రాంతి పండుగ సమయంలో గంగిరెద్దుల వాళ్లు వచ్చినట్లుగా బీజేపీ, కాంగ్రెస్ నాయకులు రాగానే వాళ్ల మాటలు ప్రజలు నమ్మవద్దన్నారు. సమావేశంలో సర్పంచ్ కోదూరు రంగనాయకమ్మ, బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేఎస్ఎన్.రెడ్డి, పర్కాల శ్రీనివాసరెడ్డి, రెడ్యాల ఎంపీటీసీ చింతల లలితసైదులు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు మహబూబ్ పాషా, జెడ్పీటీసీ లూనావత్ ప్రియాంక, ఉపసర్పంచ్ నూనావత్ ఇస్తారి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి నర్సింగ వెంకన్న, పీఏసీఎస్ డైరెక్టర్ నర్సింగ రాఘవులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరల పంపిణీ

మహబూబాబాద్: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మహిళలకు ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ బతుకమ్మ చీరలను, క్రీడాకారులకు స్పోర్ట్స్ కిట్స్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్‌ఫరీద్, కమిషనర్ ప్రసన్నరాణి, డీఈ సీహెచ్‌ఉపేందర్, ఏఈ సురేష్, తదితరులు పాల్గొన్నారు.

తండాలకు బీటీ రోడ్లు కేసీఆర్ చలవే

నెల్లికుదురు: తండాతండాకు బీటీ రోడ్లు వేసి గిరిజన ప్రజలను రవాణా కష్టాలు నుంచి కడతేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ అన్నారు. మండలంలోని జామతండా, తారాసింగ్ బావి తండా, నల్లగుట్ట తండా, రత్తిరాం తండా శివారు ఆవులేగ తండా, కునాయికుంట తండాలకు బుధవారం 9.70కోట్లతో బీటీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. అంతకు ముందు యాదవ సంఘం నుంచి ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే, ఎంపీలకు పూలు, బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు, మేకపోతు శ్రీనివాసరెడ్డి, ఎంపీపీ ఎర్రబెల్లి మాధవి, మండల అధ్యక్షుడు పరుపాటి వెంకట్‌రెడ్డి, నాయకులు భూక్య బాలాజీ నాయక్, వెంకటేశ్వరరెడ్డి, సర్పంచ్‌లు శారద హనుము, మానిక శ్రీనివాస్, బీముడు, గుగులోతు బిక్కు నాయక్ పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలుస్తా..

● ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రెడ్యానాయక్

కురవి: రాబోయే ఎన్నికల్లో డోర్నకల్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీతో గెలుస్తానని, నమ్మకం, విశ్వాసంతో పనిచేస్తున్నానని ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం సీరోలు మండల కేంద్రంతోపాటు కురవి మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. బతుకమ్మ చీరలను, గృహలక్ష్మీ మంజూరు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇచ్చిన హామీల మేరకు చెప్పిన పనులన్నీ చేసి చూపించానని తెలిపారు. సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లన్నారు. నమ్మకంతో పనిచేస్తున్నా.. సేవ చేసే భాగ్యం లభిస్తుందని, ఆశీర్వదించాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వార్ వన్‌సైడ్‌గా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వి.వెంకటరెడ్డి, సర్పంచ్‌లు శ్యామల రంగమ్మ, కవిత, పద్మ, జ్యోత్స్నవెంకట్‌రెడ్డి, నూతక్కి పద్మ, పోరెడ్డి రాంరెడ్డి, జీవన్, శరత్, రవి, గుగులోత్ పద్మ, మూడు అరుణ, ఎంపీటీసీలు చిన్నం భాస్కర్, దేవేందర్, ఎంపీపీ పద్మావతిరవినాయక్, జెడ్పీటీసీ బండి వెంకటరెడ్డి, సొసైటీ చైర్మన్‌లు దొడ్డగోవర్ధన్ రెడ్డి, వెంకటరెడ్డి, శ్రీదేవి, లాలయ్య పాల్గొన్నారు.

మండలం పేరు మరచిన అధికారులు

అధికారికంగా మండలం ఏర్పాటైంది.. నూతన మండలంగా సీరోలు ఆవిర్భావం అయి విధులు నిర్వహిస్తున్నారు.. అయితే కొందరు అధికారులు నిర్లక్ష్యం వీడడంలేదు.. బుధవారం రూ.1.43కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనానికి ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ శంకుస్థాపన చేశారు. శిలాఫలంపై మాత్రం సీరోలు మండలానికి బదులు ఉమ్మడి కురవి మండలంగా పేరును ఏర్పాటు చేయడంతో అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది.

ఆర్మీకి ఎంపికైన యువకులకు సన్మానం



సన్మానిస్తున్న మాజీ కల్నల్ సుంకర శ్రీనివాసరావు, డీఎస్పీ సత్యనారాయణ

కురవి: ఆర్మీలోకి కన్న కొడుకులను పంపించిన తల్లిదండ్రులకు వందనం చేస్తున్నామని మాజీ కల్నల్ సుంకర శ్రీనివాసరావు అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో ఆర్మీలో నూతనంగా ఎంపికైన 13మంది యువకులను, వారిని ఆర్మీలోకి వెళ్లేందుకు ప్రోత్సహించిన తల్లిదండ్రులకు మాజీ కల్నల్ శ్రీనివాసరావు, మహబూబాబాద్ డీఎస్పీ సత్యనారాయణ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ సుబేదారి మేజర్‌లు స్వామి, రవి, సీఐ రమేష్, ఎస్సై గోపి, ఎంపీటీసీ చిన్నం భాస్కర్, టీయుడబ్ల్యూజే(ఐజేయు) జిల్లా అధ్యక్షుడు చిత్తనూరి శ్రీనివాస్, వార్డు సభ్యుడు నూతక్కి నర్సింహరావు, హెచ్ఎం వాహిద్, పీడీ జ్యోతి, శ్రీనివాస్, కోచ్ కర్నం సింధువర్మ, జాతీయ క్రీడాకారుడు కర్నం నిఖిల్‌వర్మ, ఆర్మీ ఉద్యోగులు, పాల్గొన్నారు.

ఆర్టీసీ స్థలం స్వాధీనం

డోర్నకల్: డోర్నకల్ బైపాస్ రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్‌లో ఆక్రమణకు గురైన స్థలాన్ని ఆర్టీసీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. బైపాస్ రోడ్డులో 138 సర్వే నంబర్‌లో ఆర్టీసీ బస్టాండ్‌కు 2.24 ఎకరాల స్థలం ఉండగా ఈ స్థలంలో మూడు దశాబ్దాల క్రితం బస్టాండ్ నిర్మించారు. కొద్ది రోజుల క్రితం బస్టాండ్ ప్రక్కన ప్రభుత్వ భూమిలో దోభీ ఘాట్ నిర్మాణం చేపట్టారు. దోభీ ఘాట్ నిర్మిస్తున్న ప్రాంతంలో 209 గజాల ఆర్టీసీ బస్టాండ్‌కు చెందిన స్థలాన్ని ఆక్రమించి ప్రహరీ నిర్మాణం చేపట్టినట్లు ఆర్టీసీ అధికారులు గుర్తించారు. బుధవారం మహబూబాబాద్ డిపో మేనేజర్ విజయ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ వాంకుడోత్ వీరన్న, కౌన్సిలర్ బోరగళ్ల శరత్ సమక్షంలో ప్రహరీ నిర్మాణాన్ని తొలగించి స్థలాన్ని స్వాధీనపర్చుకున్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి

పెద్దవంగర: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ఈదురు రాజేశ్వరి అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా జరిగింది. విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని గంట్లకుంట సర్పంచ్ చింతల భాస్కర్ విద్యుత్ అధికారులను కోరారు. రుణమాఫీ విషయంలో సందేహాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని వ్యవసాయాధికారి కుమార్ యాదవ్ తెలిపారు. 2,450 మంది రైతులకు రూ.15.80 కోట్ల రుణమాఫీ అయిందని వెల్లడించారు. గృహలక్ష్మి దరఖాస్తులను ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి ప్రభుత్వం దృష్టికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జ్యోతిర్మయి, మండల ప్రత్యేక అధికారి ఖుర్షీద్, ఏఓ కుమార్ యాదవ్, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఊరూరా బతుకమ్మ చీరల పంపిణీ



బయ్యారం: చీరలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ

డోర్నకల్: మండలంలోని చాప్లాతండాలో సర్పంచ్ బానోత్ పాండునాయక్, ఉయ్యాలవాడలో సర్పంచ్ నున్నా జయలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు మల్లికార్జున్, అందనాలపాడులో సర్పంచ్ ఆంగోత్ మోహన్, తెల్లబండతండాలో సర్పంచ్ శ్రీనివాస్, గొల్లచర్లలో సర్పంచ్ సమ్మిరెడ్డి మహిళలు బతుకమ్మ చీరలను పంపిణీ చేశారు.

బయ్యారం: రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా మహిళలకు ఇస్తున్న చీరలను ఎమ్మెల్యే హరిప్రియ బుధవారం బయ్యారంలో పంపిణీ చేశారు. అనంతరం యువతకు క్రికెట్ కిట్‌తో పాటు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భగవాన్‌రెడ్డి, ఇల్లందు ఏఎంసీ చైర్మన్ హరిసింగ్, వైస్ ఎంపీపీ గణేష్, ఎంపీటీసీ కుమారి, సొసైటీ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, బాలాజీపేట సర్పంచ్ జగన్ పాల్గొన్నారు.

సేవలు వినియోగించుకోవాలి

నర్సింహులపేట: తపాలా సేవలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఆఫీస్ వరంగల్ సూపరింటెండెంట్ నర్సింహస్వామి అన్నారు. మండల కేంద్రంలో బుధవారం నూతనంగా మంజూరైన సబ్ పోస్టాఫీస్ కార్యాలయంను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి 18 సంవత్సరాలు నిండిన వ్యక్తులు తపాలా సేవలు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు సైదానాయక్, సుధాకర్, సర్పంచ్ రజిత, ఉప సర్పంచ్ నాగన్న పాల్గొన్నారు.

గ్రామపంచాయతీలకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ



డోర్నకల్: స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు

డోర్నకల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం సర్పంచులకు స్పోర్ట్స్ కిట్లను పంపిణీ చేశారు. ఎంపీడీఓ చలపతిరావు, ఎంపీఓ మున్వర్ అలీ చేతుల మీదుగా సర్పంచులకు క్రికెట్, వాలీబాల్, డంప్ బెల్, టీషర్ట్ కిట్లలోని 26 రకాల క్రీడా పరికరాలను పంపిణీ చేశారు.

గంగారం: మండల కేంద్రంలోని రైతువేదికలో స్పోర్ట్స్ కిట్స్ బుధవారం పంపిణీ చేశారు. మండలంలోని 26 గ్రామపంచాయతీలకు 26 రకాల కిట్స్‌ను పంపిణీ చేయడం జరిగిందని ఎంపీపీ సరోజన, జెడ్పీటీసీ రమ, ఎంపీడీఓ అర్జలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాము, ఎంపీఓ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆత్మస్థైర్యంతో విజయాలు సాధించాలి



మాట్లాడుతున్న చైర్మన్ శ్రీరంగారెడ్డి

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లి అన్నిరంగాల్లో అద్భుత విజయాలను సాధించాలని నలంద విద్యా సంస్థల చైర్మన్ నూకల శ్రీరంగారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్తిగార్డెన్‌లో బుధవారం కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ నూకల శ్రీరంగారెడ్డి, కరస్పాండెంట్ డాక్టర్ డోలి సత్యనారాయణ, కళాశాల డైరెక్టర్ సాధన, ప్రిన్సిపాల్స్ వై.కృష్ణ ప్రసాద్, గట్ల శ్రీపాల్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



మహబూబాబాద్: దీక్షలో పాల్గొన్న మధ్యాహ్న భోజన కార్మికులు

మహబూబాబాద్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, నాయకుడు సమ్మెట రాజమౌళి డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం నాటికి ఏడో రోజుకు చేరింది. కార్యక్రమంలో రాణి, రాధిక, మౌనిక, యాకమ్మ, ప్రమీల, సుగుణమ్మ, అరుణ పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో నిరసన

గార్ల: మధ్యాహ్న భోజన కార్మికులు తమ ఆందోళనలో భాగంగా బుధవారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కందునూరి శ్రీనివాస్, పద్మ, సరిత, పూలమ్మ, బుజ్జి, రమా, రేణుక పాల్గొన్నారు.

డోర్నకల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సాయికుమార్, మండల ఇన్‌చార్జ్ గుగులోత్ సూర్యప్రకాశ్ డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ సెంటర్‌లో మధ్యాహ్న భోజన కార్మికుల దీక్షకు ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

పోలింగ్ కేంద్రాల పరిశీలన

దంతాలపల్లి: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం సెక్టర్ ఆఫీసర్ పర్యటించి పోలింగ్ కేంద్రాలను సందర్శించి బూతు కమిటీలకు నంబర్లు ఇచ్చారు.

నాణ్యమైన విద్యనందించాలి

గూడూరు: ప్రతీ రోజు పీరియడ్స్ ప్లాన్స్‌కు అణుగుణంగా తొలిమెట్టు ప్రణాళికతో నాణ్యమైన విద్యనందించాలని అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఆజాద్ చంద్రశేఖర్ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రాముడు, శ్రీనివాస్, భాగ్యలక్ష్మి, జయశ్రీ, యశోద, షైనబి, కొండమ్మ పాల్గొన్నారు.

ప్రభుత్వాన్ని గద్దె దించాలి

నెల్లికుదురు: డబుల్ బెడ్రూం ఇళ్లు, దళితబంధు, గృహలక్ష్మి, బీసీబంధు అంటూ ప్రజలను మోసం చేస్తున్న కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎడ్ల యాదవరెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతులతో పాటు ప్రజలందరికీ అండగా ఉండేందుకే ప్రజలకు ఆమోదయోగ్యమైన పథకాలను మేనిఫెస్టోలో పెట్టిందన్నారు.

వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

కొత్తగూడ: ఈనెల 7న మంద కృష్ణ పాదయాత్ర విజయవంతం చేయాలని ముద్రించిన వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రేమ్‌సాగర్, వెంకటేష్, సమ్మయ్య, రవి, సూరయ్య, ఉపేందర్, ప్రకాష్ పాల్గొన్నారు.

పోక్సో కేసు నమోదు

డోర్నకల్: డోర్నకల్‌లో ఓ వ్యక్తి మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు డోర్నకల్ సీఐ బి.ఉపేందర్ రావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. డోర్నకల్‌కు చెందిన తేజావత్ రమేష్ మంగళవారం రాత్రి మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించినట్లు ఫిర్యాదు రావడంతో రమేష్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

సంక్షేమ పథకాలు అందజేయాలి

కురవి: దివ్యాంగులకు ప్రభుత్వం అందజేసే సంక్షేమ పథకాలను ఇవ్వాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సయ్యద్ ఖాజా అన్నారు. బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.అర్హులైన దివ్యాంగులకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, కొత్తరేషన్ కార్డులు, అంత్యోదయ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గౌరమ్మ, వీరన్న, మల్లికార్జున్, ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఉచిత విద్యుత్ ఇవ్వాలి

నెహ్రూసెంటర్: రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు 300యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలని కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యనమల కిరణ్, దుడ్డెల రాంమూర్తి అన్నారు. కేవీపీఎస్ ఆవిర్భావ వారోత్సవాల సందర్భం సంఘం జెండాను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు జానీ, రాజు, వెంకన్న, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

సన్మానం

గూడూరు: గూడూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా కొత్తగా ఎన్నికైన మాజీ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామిని ఏఐసీసీ ఆదివాసీ వైస్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రమేష్‌నాయక్, మండల ప్రధాన కార్యదర్శి బీరం శ్రీపాల్‌రెడ్డి, హరినాయక్ పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

గార్ల: అంగన్‌వాడీల చలో హైదరాబాద్ పిలుపులో భాగంగా బుధవారం మండలంలోని పలు గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు.

నెల్లికుదురు: సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీ టీచర్లు సమ్మె నిర్వహిస్తుంటే అక్రమంగా ప్రభుత్వం పోలీసులతో అరెస్టు చేయించడం దారుణం అని సీఐటీయూ మండల కార్యదర్శి ఇస్సంపెల్లి సైదులు అన్నారు.

కేసముద్రం: అంగన్‌వాడీ ఉద్యోగులను ధర్నాకు వెళ్లకుండా, ముందస్తు జాగ్రత్తగా పలువురు అంగన్‌వాడీ టీచర్లను పోలీసులు అరెస్టు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్, నాగేంద్ర, లలిత, నిర్మల, రజిని, సుజాత పాల్గొన్నారు.

అధికార పార్టీ నాయకులకే పథకాలు

కొత్తగూడ: అధికార పార్టీ నాయకులకే ప్రభుత్వ పథకాలు అందుతున్నాయని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య ఆరోపించారు. బుధవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో ఎంపీపీ బానోతు విజయ, నాయకులు నారాయణరెడ్డి, రూప్‌సింగ్, మొగిళి పాల్గొన్నారు.

గేదెకు రెండు దూడల జననం

నర్సింహులపేట: మండల కేంద్రంలో పోన్నం సంజీవకు చెందిన గేదె బుధవారం ఒకే ఈతలో రెండు ఆరోగ్యకరమైన దూడలకు జన్మనిచ్చింది. ఇలాంటివి చాలా అరుదుగా జరుగుతుంటాయని పశు వైద్యాధికారి సౌమ్య తెలిపారు.

యూత్ పార్లమెంట్‌కు ఎంపికైన హథీరాంనాయక్



గార్ల: ఈనెల 8, 9, 10 తేదీల్లో ఉస్మానియా యూనివర్సిటీ వేదికగా నిర్వహిస్తున్న సిటిజన్ యూత్ పార్లమెంట్‌కు మండలంలోని అంజనాపురానికి చెందిన ఉపాధ్యాయుడు హథీరామ్‌నాయక్ ఎన్నికయ్యాడు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మరిపెడ రూరల్: నేడు ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి తెలిపాడు. అభివృద్ధి కార్యక్రమాలను విజయవంతం చేయాలన్నారు.

రెండోవిడత గొర్రెలను పంపిణీ చేయాలి

కేసముద్రం: డీడీలు కట్టిన ప్రతి ఒక్కరికి రెండో విడత గొర్రెలను వెంటనే పంపిణీ చేయాలని ఇనుగుర్తి మండల గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు చిన్నాల కట్టయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఇనుగుర్తి మండల కేంద్రంలో జరిగిన సంఘం ఆధ్వర్యంలో వాల్‌పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈనెల 5న చేపట్టే కలెక్టరేట్ ముట్టడిని జయప్రదం చేయాలని కోరారు.

పోస్టల్ సిబ్బంది సమ్మె

కేసముద్రం: తమ సమస్యలను తక్షణమే పరిష్కరించాలంటూ మండల కేంద్రంలోని సబ్‌పోస్టాఫీస్ ఎదుట పోస్టల్ సిబ్బంది బుధవారం ఒక్కరోజు సమ్మె నిర్వహించారు. ఈసందర్భంగా పోస్టల్ సిబ్బంది మాట్లాడుతూ.. 8గంటల పని, పెన్షన్‌తో సహా అన్ని ప్రయోజనాలను మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో జీడీఎస్ ఆర్గనైజర్ పింగిలి మల్లయ్య, పోస్ట్‌మాస్టర్లు మాధవి, మొయినుద్దీన్, శ్రీనివాస్, సుమన్ పాల్గొన్నారు.

'అభివృద్ధిని అడ్డుకోవడం లేదు'

నర్సింహులపేట: మండల కేంద్రం అభివృద్ధిని అడ్డుకోవడం లేదని ఉపసర్పంచ్ కర్ల నాగన్న అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ఎక్కడ అభివృద్ధి పనులకు అడ్డుకోలేదని తప్పుడు ఆరోపణలు సరికాదన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ యూత్ మాజీ అధ్యక్షుడు బండి రమేష్, రైతు కోఆర్డినేటర్ కొండ్రెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వార్డు సభ్యులు నవీన్, మధార్ పాల్గొన్నారు.

అవినీతికి కేరాఫ్ బీఆర్ఎస్ ప్రభుత్వం



నియామక పత్రాలు అందజేస్తున్న అంజయ్య

మహబూబాబాద్ రూరల్: బీఆర్ఎస్ పార్టీ మోసాలు, అవినీతికి కేరాఫ్ అయిందని అర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఘణపురపు అంజయ్య అన్నారు. పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. మాజీ కేంద్ర మంత్రి పోరిక బలరాంనాయక్, మాజీ మంత్రి షబ్బీర్ అలీకి కాంగ్రెస్ పార్టీ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీలో చోటు కల్పించడంపై శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం అర్బన్ కాంగ్రెస్ పార్టీ కార్యవర్గంలో సీనియర్ ఉపాధ్యక్షులుగా బండి ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శులుగా కౌన్సిలర్ భూక్య శ్రీను, గండు కార్తీక్ గౌడ్, కార్యదర్శులుగా బండారు చిరంజీవి, మాలోత్ సురేష్, గుగులోత్ రాందాస్, వేల్పుల విష్ణువర్ధన్, పిల్లి కృష్ణ, తోట వెంకన్నయాదవ్, షేక్ సలీం, ఆవుల సతీష్ నియామకపత్రాలు అందజేశారు.

సొంతింటి కల సాకారం

దంతాలపల్లి: పేదోడి సొంతింటి కల సీఎం కేసీఆర్‌తో సాకారం అయిందని సర్పంచ్ అల్లం కృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని కుమ్మరికుంట్ల గ్రామంలో సర్పంచ్ అల్లం కృష్ణ లబ్ధిదారులకు గృహలక్ష్మి మంజూరు పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ మాట్లాడారు. కార్యక్రమంలో గ్రామ శాఖ అధ్యక్షుడు రామన్న, ఉప సర్పంచ్ షాంకూరి సత్తెమ్మ, పంచాయతీ కార్యదర్శి అక్షర, గ్రామస్తులు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

డోర్నకల్: డోర్నకల్‌లో దళిత బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవిత డిమాండ్ చేశారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడారు. నిందితుడిని కఠినంగా శిక్షించాలన్నారు. సమావేశంలో సర్పంచులు బొబ్బ లక్ష్మి, ఆంగోత్ సరోజ, సీపీఎం నాయకులు వెంకన్న, ఆంగోత్ వెంకన్న, బొబ్బ వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డోర్నకల్‌లో బీజేపీ జెండా ఎగురవేస్తాం..



మరిపెడ: తెలంగాణ ఉద్యమకారుడిగా ఉస్మానియా యూనివర్సిటీ యుద్ధ వీరుడు తనకు బీజేపీ నుంచి డోర్నకల్ అసెంబ్లీ టికెట్ ఇస్తే డోర్నకల్ గడ్డమీద బీజేపీ జెండా ఎగురవేస్తానని తెలంగాణ ఉద్యమకారుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ లూనావత్ నెహ్రూనాయక్ అన్నారు. 15రోజులుగా డోర్నకల్ నియోజకవర్గంలోని వివిధ మండలాల పర్యటనలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు భూక్య కాంతమ్మ, టౌన్ అధ్యక్షుడు లింగం, మండల అధ్యక్షుడు బింగి రమేష్, నాయకులు జగన్, బాలాజీ పాల్గొన్నారు.

ప్రైవేట్ ఆస్పత్రిలో శిశువు మృతి

● ఆస్పత్రి ఎదుట బంధువుల ఆందోళన

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శిశువు మృతి చెందిన ఘటన బుధవారం జరిగింది. జిల్లాలోని డోర్నకల్ మండలం గొల్లచర్లకు చెందిన శిరీషను కాన్పు కోసం ఖమ్మం నెహ్రూనగర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రిలో బంధువులు చేర్పించారు. వైద్యులు కాన్పు చేయగా కవల పిల్లలు జన్మించారు. వీరిలో ఒకరి బరువు తక్కువగా ఉందని వైద్యులు వెల్లడించడంతో బంధువులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ఇంక్యుబేటర్ బాక్స్‌లో ఉంచి చికిత్స చేయిస్తున్నారు. మరో శిశువుకు వైద్యం చేసేందుకు రూ.లక్ష కట్టాలని చెప్పగా బంధువులు చెల్లించారు. ఇంతలోనే సదరు శిశువు మృతి చెందడంతో ఆగ్రహించిన బంధువులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. విషయం తెలుసుకున్న టూటౌన్ పోలీసులు చేరుకుని చర్చించినా వెనక్కి తగ్గకపోవడంతో ఆస్పత్రి యాజమాన్య బాధ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా, శిశువు మృతి చెందిన విషయం వైద్యులకు తెలిసినా చికిత్స పేరిట రూ.లక్ష వసూలు చేశారని బంధువులు ఆరోపించారు.